# సబ్బాతు

## ఓవెన్ డి. ఆల్‌బ్రిచ్

"సబ్బాతు" అనే పదం *Shabbath* అనే హెబ్రీ పదంనుండి, *sabbaton* అనే గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడింది. "వెనుదీయు, విశ్రమించు, తీరికగా ఉండు" అని దాని భావం. మోషే కాలంనుండి ఇశ్రాయేలీయులు ఆచరించిన ప్రత్యేకమైన విశ్రాంతి దినాలకు "సబ్బాతు" అనే పదం ఉపయోగించబడింది. వారానికి సంబంధించిన విశ్రాంతి దినాలు, శుక్రవారం సాయంత్రం 6 గంటలనుండి శనివారం సాయంత్రం 6 గంటలవరకు మన కాలం ప్రకారం ఉంటుంది. "సబ్బాతు" అనే పదం తొలిగా నిర్గమ. 16:23లో కన్పిస్తుంది. ఏడవ దినపు విశ్రాంతికి సంబంధించి ఆదికాండంలో నరుల ఆచరణకు యివ్వబడినట్టు ఎక్కడా కన్పించదు.

వారపు సబ్బాతులు మాత్రమే గాక, ప్రాయశ్చిత్త దినము (లేవీయ. 16:29-31; 23:27-32) వంటి ప్రత్యేకమైన విశ్రాంతి దినాలు యూదులకు ఉండేవి. మరియు ప్రతి ఏడవ సంవత్సరము ప్రత్యేకమైన విశ్రాంతి సంవత్సరముగా వారు ఆచరింప వలసినదిగా ఆజ్ఞాపించబడ్డారు (నిర్గమ. 23:10, 11; లేవీయ. 25:1-7; ద్వితీయో 15:1-11). ప్రత్యేకించి సబ్బాతు దినాలని పిలువబడకపోయినా, కొన్ని సందర్భాల్లో పనినుండి విశ్రమించాలని చెప్పబడిన సమయాలున్నాయి: (ఉదా), ఏడు దినాల పస్కాకు సంబంధించిన మొదటి దినం (సంఖ్యా. 28:18); పండుగ వారాల్లో మొదటి దినాన, ప్రథమ ఫలముల పండుగ లేక వారముల పండుగ (లేవీయ. 23:21; సంఖ్యా. 28:26); శృంగనాదపు పండుగ (లేవీయ. 23:24, 25; సంఖ్యా. 29:1, 7, 12, 35); మరియు పర్ణశాలల పండుగలో కూడ విశ్రమించవలసి యుంటుంది (లేవీయ. 23:35, 36).

ఏడవ దినపు విశ్రాంతికి సంబంధించి ఆదికాండంలో చేయబడిన ఒకే సూచన 2:3లో యిలా కన్పిస్తుంది: "కాబట్టి దేవుడు ఆ యేడవ దినమును ఆశీర్వదించి పరిశుద్ధపరచెను; ఏలయనగా దానిలో దేవుడు తాను చేసినట్టియు, సృజించినట్టియు తన పని అంతటినుండి విశ్రమించెను." విశ్రాంతి దినాచారము దేవుని ప్రజలకు అనేక సంవత్సరాల తరువాతనే ఆజ్ఞాపించబడింది. నెహెమ్యా యిలా అన్నాడు:

> సీనాయి పర్వతము మీదికి దిగి వచ్చి ఆకాశమునుండి వారితో మాటలాడి, వారికి నీతియుక్తమైన విధులను సత్యమైన ఆజ్ఞలను మేలుకరములైన కట్టడలను ధర్మములను నీవు దయచేసితివి. వారికి నీ పరిశుద్ధమైన విశ్రాంతి దినమును ఆచరింప నాజ్ఞ ఇచ్చి నీ దాసుడైన మోషేద్వారా ఆజ్ఞలను కట్టడలను ధర్మశాస్త్రమును వారికి నియమించితివి (9:13, 14).

యెహెజ్కేలు యిలా రచించాడు,

> వారిని ఐగుప్తుదేశములోనుండి రప్పించి అరణ్యములోనికి తోడుకొని వచ్చి వారికి నా కట్టడలను నియమించి నా విధులను వారికి తెలియజేసితిని. ఎవడైన వాటిననుసరించిన యెడల వాటినిబట్టి బ్రదుకును. మరియు యెహోవానగు నేనే వారిని పవిత్రపరచు వాడనని వారు తెలిసికొనునట్లు నాకును వారికిని మధ్య విశ్రాంతి దినములను వారికి సూచనగా నేను నియమించితిని (యెహెజ్కేలు 20:10–12).

ద్వితీయో. 5:15లోని మోషేయొక్క ప్రతిపాదనను యిది ప్రతిధ్వనిస్తుంది: "నీవు ఐగుప్తు దేశమందు దాసుడవైయున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలముచేతను చాచిన చేతిచేతను నిన్ను అక్కడనుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను." ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి వచ్చిన తరువాత సీనాయి కొండవద్ద సబ్బాతు దేవునికి ఇశ్రాయేలీయులకు మధ్య నిబంధనగాను, గురుతుగాను నియమింపబడింది (నిర్గమ. 31:13, 16, 17; యెహెజ్కేలు 20:12).

సీనాయి వద్ద సబ్బాతు యొక్క ప్రత్యక్షతను సిద్ధపాటుగా ఆరవ దినమున దేవుడు ఇశ్రాయేలీయులకు రెండంతల ఎక్కువ మన్నాను యిచ్చాడు (నిర్గమ. 16:23–30). ఏడవ దినపు అంతంవరకు ఇశ్రాయేలీయులు ఆరవ దినమున మన్నా కూర్చుకొన వలసినవారైయున్నారు మరియు వారు విశ్రాంతి దినమున తమ తమ నివాసములలో ఏడవ దినమున విశ్రమించవలసినవారై ఉన్నారు. మోషే వారికి యిలా వివరించాడు: "చూడుడి నిశ్చయముగా యెహోవా ఈ విశ్రాంతిదినమును ఆచరించుటకు సెలవిచ్చెను గనుక ఆరవ దినమున రెండు దినముల ఆహారము మీ కనుగ్రహించుచున్నాడు. ప్రతివాడును తన తన చోట నిలిచి యుండవలెను. ఏడవ దినమున ఎవడును తన చోటనుండి బయలువెళ్లకూడదనెను" (నిర్గమ. 16:29).

## పది ఆజ్ఞలలో సబ్బాతు

సబ్బాతుయొక్క మూడు ప్రధాన విషయాలు పది ఆజ్ఞలయందు చెప్పబడ్డాయి (నిర్గమ. 20:8–11).

(1) సబ్బాతు సంపూర్ణమైన విశ్రాంతి దినముగా ఉండాలి. కుటుంబ సభ్యులు గాని, సేవకులు గాని, జంతువులు గాని దర్శింప వచ్చినవారు గాని, లేక ఇశ్రాయేలీయుల దేశపు సరిహద్దులలోని ఏ జనమేగాని ఏ పనియు చేయకూడదు (8–10 వచనాలు; ద్వితీయో. 5:12–15).

(2) ఏడవ దినాన్ని దేవుడు సబ్బాతుగా, విశ్రాంతి దినంగా కోరుతున్నాడు, ఎందుకంటే ఆయన ఏడవ దినాన విశ్రమించాడు, "ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవ దినమున విశ్రమించెను; అందుచేత యెహోవా విశ్రాంతిదినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధ పరచెను" (నిర్గమ. 20:11).

(3) సబ్బాతు ఇశ్రాయేలీయులకు జ్ఞాపకార్థ దినము. ఐగుప్తు బానిసత్వమునుండి దేవుడు వారిని విడిపించిన దానిని జ్ఞాపకం చేసికొని, విశ్రమించుతూ కొనియాడవలసిన దినమది. "నీవు ఐగుప్తుదేశమందు దాసుడవైయున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహు బలముచేతను చాచిన చేతిచేతను నిన్ను అక్కడనుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతిదినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" (ద్వితీయో. 5:15).

దేవుడు ఏడవ దినమున విశ్రమించినందున ఆయన ఆ దినాన్ని కోరుకున్నాడు. అయితే సబ్బాతు ఇశ్రాయేలీయులకు ప్రత్యేకమైన ఆరాధనా దినంగా ఉన్నట్టు ఎక్కడను చెప్పబడలేదు. దేవుని సృష్టికిగాని లేక ఆయన విశ్రాంతికిగాని జ్ఞాపకార్థంగా ఆ దినాన్ని ప్రత్యేకంగా ఉంచాలని ఎక్కడను ఆజ్ఞాపించబడలేదు.

వారి బానిసత్వంనుండి వెలుపలికి తీసికొని వచ్చిన సంగతిని జ్ఞాపకం చేసికొనడానికి దేవుడు జనులకు ఈ దినాన్ని యిచ్చినది వాస్తవం. అంటే, వారు ఐగుప్తు బానిసత్వంనుండి విడుదల చేయబడక ముందు అది యివ్వబడి యుండేది కాదు. పైగా, బానిసలుగా ఉండిన నాలుగువందల సంవత్సరాలు సబ్బాతును వారు ఆచరించలేక పోయేవారు (ఆదికాండం 15:13; అపొ. 7:6) ఎందుకంటే, ఆ కాలంలో ఇశ్రాయేలీయులు బానిసలుగా ఉన్నారు.

## సృష్టి ఆరంభమందు సబ్బాతు యివ్వబడిందా?

తాను చేసిన పని యంతటినుండి దేవుడు విశ్రమించినవాడు, మానవాళి ఏడవ దినాన్ని ఆచరించాలని దేవుడు దానిని ప్రత్యేకించినట్లు ఆదికాండం 2:1-3 బోధిస్తుందా? తటాలున మనం చూచినప్పుడు, సృష్టి ఆరంభంనుండి విశ్రాంతి దినాచారం ఉన్నట్టు మనం తలంచవచ్చు. ఏదియెలాగున్నా, ఐగుప్తు బానిసత్వంనుండి ఇశ్రాయేలీయులను విడిపించినందుకు జ్ఞాపకార్థంగా సబ్బాతు దినం యివ్వబడిందనే వాస్తవాన్ని అలాటి తలంపు అలక్ష్యపెట్టి యుండవచ్చు. అంతేగాక సృష్టి జరిగిపోయిన అనేక (2500) సంవత్సరాల తరువాత మోషే ఆదికాండం వ్రాశాడన్న వాస్తవాన్ని సహితం అది పరిగణించ లేదనవచ్చు.

1968లో హత్య చేయబడిన పౌర హక్కుల సంఘ నాయకుడైన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ యొక్క జన్మ దినోత్సవం జనవరి మూడవ సోమవారం అమెరికా దేశంలో జరుపబడుతుంది. ఒక చరిత్రకారుడు కింగ్ యొక్క జీవిత చరిత్రను గూర్చి వ్రాసేటప్పుడు, అతడు జనవరి 16, 1929న పుట్టినట్టు వ్రాయవచ్చు. అప్పుడు కింగ్ జన్మ దినం ప్రత్యేకంగా నియమింపబడియుందని ఒక గమనికను అతడు అందులో చేర్చవచ్చు. అతని జన్మ దినాన్ని కింగ్ గౌరవార్థం జాతీయ దినంగా గుర్తిస్తూ నవంబరు 2, 1983లో రొనాల్డ్ రీగన్ ఒక బిల్లుపై సంతకం చేశాడన్న సంగతి అతడు వివరింపక పోయి ఉండవచ్చు.

ఈ జీవిత చరిత్ర రచయిత లాగే, మోషే గతంలోకి చూస్తున్నాడు. సృష్టిని గూర్చియు,

దేవుడు ఏడవ దినమున విశ్రమించిన దానిని గూర్చియు చెప్పిన తరువాత, విశ్రాంతిదినంగా దేవుడు దానిని ప్రత్యేకించాడని చెప్పాడేగాని, ఆ దినాల్లో దానిని ఎవరైనా ఆచరించాలని దేవుడు చెప్పియుండలేదు సుమీ. ఇశ్రాయేలీయులు ఐగుప్తును వీడిన తరువాత సీనాయి పర్వతము వద్ద విశ్రాంతి దినముగా ఆచరించాలని దేవుడు వారిని కోరినట్టు మోషే తెలిపాడు (ద్వితీయో. 5:15). సబ్బాతు ఎరుక చేయబడి నియమింపబడిన సమయం యిదే అన్నట్టు యితర లేఖనాలు స్థిరపరచుతున్నాయి (నెహెమ్యా 9:13, 14; యెహెజ్కేలు 20:10–12).

ఈలాటి రచనా శైలి పాత నిబంధనలోని యితర భాగాలలో కన్పిస్తుంది. ఉదాహరణకు, ఆదాము హవ్వలు తల్లిదండ్రులు కాక పూర్వమే, మనిషి ఎందుకు తన తల్లిని తన తండ్రిని విడిచి తన భార్యను హత్తుకోవాలని మోషే వివరించాడు? (ఆది. 2:24). ఆదాము తన భార్యను "హవ్వ" అని పిలిచాడు, అంటే, ఆమె యింకా బిడ్డను కనకముందే (ఆది. 3:20) "సమస్త జీవులకు తల్లి" అనబడింది.

ఇంకను, ఆయా స్థలాలు వాటికి ఆ పేర్లు కలుగక ముందే ప్రత్యేకమైన పేర్లతో పిలువబడ్డాయి. ఉదాహరణకు, "బేతేలు" అనే పేరు దానికి యివ్వబడకముందే బేతేలు ఆ పేరుతో పిలువబడింది (ఆది. 12:8; 13:3; ఆది. 28:19). అలాగే, "బెయెర్షెబా" అని అది పేరు పెట్టబడకముందే (ఆది. 21:31), అది బెయెర్షెబా అని పిలువబడింది (21:14). "మోరీయా" అని అది పేరు పెట్టబడక ముందే (సంఖ్యా. 21:3), అది మోరీయా అని పిలువబడింది (సంఖ్యా. 14:45). "గిల్గాలు" అని అది పేరు పెట్టబడక ముందే (యెహోషువ 5:9), అది గిల్గాలు అని పిలువబడింది (ద్వితీయో 11:30; యెహోషువ 4:19, 20). "దాను" అని అది పేరు పెట్టబడక ముందే అది దాను అని పిలువబడింది (ద్వితీయో. 34:1; యెహోషువ 19:47; న్యాయాధి. 18:29); అది యింకను "యెబుసు" (న్యాయాధి. 19:10) అనబడుతున్నప్పుడే యెరూషలేము అని పేరు పెట్టబడింది (యెహోషువ 10:1).

బానిసత్వంనుండి బయటికి వచ్చిన తరువాత ఇశ్రాయేలీయులకు యివ్వబడిన పది ఆజ్ఞలలో సబ్బాతు నియమము ఒక భాగమైయుంది. ముందున్న ఏ తరముతోను దేవుడు ఈ నిబంధన చేయలేదని మోషే వక్కాణించాడు (ద్వితీయో. 5:1–3). ఈ విధంగా, సబ్బాతు నియమం ఆదాము హవ్వలకు గాని లేక ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడిచేవరకు ఉన్న మరి ఎవనికే గాని అది యివ్వబడలేదు.

## సబ్బాతు ఆరాధన నిమిత్తం యివ్వబడిందా?

ప్రత్యేకమైన ఆరాధనా దినంగా దేవుడు సబ్బాతు దినాన్ని ఏర్పరచినట్టు ఆదికాండం చెప్పడం లేదు. దేవుడు తన పనినుండి విశ్రమించాడు. అయితే ఏడవ దినాన ఆరాధన చేసేలా ఆయన ఆజ్ఞాపించలేదు (ఆది. 2:1–3). పది ఆజ్ఞలను యివ్వడంలో, విశ్రాంతి తీసికొని, దేవుడు వారిని ఐగుప్తు దాస్యంనుండి విడిపించిన సంగతిని ఇశ్రాయేలీయులు స్మరించాలని నిర్దేశించాడే గాని; ఆరాధనను గూర్చి అందులో ఆయన ఏమియు చెప్పలేదు

(నిర్గమ. 20:8-10; ద్వితీయో. 5:12-15).

సబ్బాతు దినాన ఆరాధనకు సంబంధించి సాధ్యమైన సూచన యెహెజ్కేలు, యెషయాలలో కన్పిస్తుంది. యెహెజ్కేలు 46 మోషే యుగానికి సంబంధించిన ఆరాధనను సూచించడం లేదు కాని పద్యానికి చెందిన భాషలో అది కేవలం ప్రవచనపు దర్శనాన్ని మాత్రమే వర్ణించింది. అది క్రైస్తవ ఆరాధనకు సంబంధించిన అక్షరార్థపు రిఫరెన్సు కాదు. క్రైస్తవులు సబ్బాతు దినాన ఆరాధించాలనే విషయం యిది రుజువు చేసినట్లయితే, క్రైస్తవులు దేవాలయంలో ఆరాధించాలనే విషయాన్ని (1 వ.), అమావాస్యలను ఆచరించడం (1, 3 వచ.), లేవీ యాజకుల ద్వారా ఆరాధించడం (2 వ.) దహనబలులను అర్పించడం (2-7 వచ.), యూదుల పండుగలను జరుపుకొనడం (9-12 వచ.), అనుదిన బలిని అర్పించడం (13-15 వచ.), విడుదల సంవత్సరాలను పాటించడం (16-18 వచ.) వంటివాటిని యిది రుజువు చేస్తుందన్న మాట.

యెహెజ్కేలు యొక్క దర్శనం యూదా ప్రవక్తల యొక్క ప్రవచనపు అలంకార భాషలో అర్థం చేసికొనవలసియుంటుంది. అది క్రైస్తవ యుగపు ఆచరణల యొక్క ఛాయా రూపం మాత్రమే అయ్యుంటుంది (హెబ్రీ. 10:1). అలాగే, ప్రకటన గ్రంథం యూదా మత సూత్రాలును క్రైస్తవ ఆరాధనా చిహ్నాలుగా ఉపయోగిస్తుంది.

సబ్బాతు దినానే దేవునికి ఆరాధన సమర్పించాలని యెషయా 66 చెప్పడం లేదు. ఆ లేఖన భాగం యిలా అంటుంది: "ప్రతి అమావాస్య దినమునను ప్రతి విశ్రాంతి దినమునను నా సన్నిధిని మ్రొక్కుటకై సమస్త శరీరులు వచ్చెదరు అని యెహోవా సెలవిచ్చుచున్నాడు" (23 వ.). సబ్బాతు వెంట సబ్బాతున ప్రజలు దేవునికి మ్రొక్కుతారని యెషయా చెప్పడం లేదు. (ఆంగ్లంలో, "సబ్బాతునుండి సబ్బాతువరకు" అని ఉంది ప్రతి సబ్బాతున అని లేదు) సబ్బాతునుండి సబ్బాతువరకు అంటే, సబ్బాతు దినాల మధ్య రోజుల్లో కూడా దేవుని ఆరాధిస్తారని దాని అర్థం.

"నీవు నన్ను పెండ్లాడినట్లయితే, సంవత్సరపు తొలినాటినుండి నూతన సంవత్సరపు తొలినాటివరకు, మరియు ఆదివారంనుండి ఆదివారంవరకు నేను నిన్ను ప్రేమిస్తానని" ఒక స్త్రీతో చెప్పిన వానితో దీన్ని పోల్చవచ్చు. కేవలం ఆ దినాలలో మాత్రమే అతడు ఆమెను ప్రేమిస్తాడని అతని భావం కాదు. అతడు ఆ దినాల్లో ఆమెను ప్రేమిస్తాడు, అదే విధంగా ఆ దినాల మధ్యనున్న ప్రతి దినం ఆమెను ప్రేమిస్తాడు. దేవుడు ఎడతెగక గౌరవింప బడతాడనేది యెషయా ప్రవచనము యొక్క భావమైయుంది.

క్రైస్తవ యుగంలో సబ్బాతును ఆచరించాలని ఈ లేఖన భాగం బోధించినట్లయితే, యూదుల యొక్క ప్రత్యేక దినములైన అమావాస్యలను క్రైస్తవులు ఆచరించవలెనని కూడా అది బోధిస్తున్నట్టే. అయితే జనులు అమావాస్యలను ఆచరిస్తూ, ప్రతి సబ్బాతు దినాన విశ్రమించుచుతూ, ఆరాధించుచుతూ ఉండాలని అది బోధించడం లేదు. అయితే, వారం వెంట వారం ప్రజలు దేవునికి లోబడియుండి దేవుని యెదుట "మ్రొక్కడం" అంటే, ఆయనను ఘనపరచుతూ ఉంటారని దాని భావం.

సబ్బాతు "పరిశుద్ధమైనదిగా" ఉండాలని దేవుడు ఆజ్ఞాపించాడు (నిర్గమ. 20:8; 31:14, 15) అంటే, "ప్రత్యేకపరచాలని" అర్థం. అది పరిశుద్ధంగా లేక ప్రత్యేకంగా

ఎత్తిపెట్టాలనే విధానాన్ని ఆజ్ఞలో యిలా వివరించాడు:

> ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతిదినము. దానిలో నీ వైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను నీ పశువైనను నీ యిండ్లలోనున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు (నిర్గమ. 20:9, 10).

ఇంకను మనం యిలా చదువుతాం,

> ఆరు దినములు పని చేయవచ్చును; ఏడవదినము యెహోవాకు ప్రతిష్ఠితమైన విశ్రాంతిదినము. ఆ విశ్రాంతి దినమున పనిచేయు ప్రతివాడును తప్పక మరణ శిక్ష నొందును (నిర్గమ. 31:15).

విశ్రాంతి దినాన్ని పరిశుద్ధంగా ఆచరించడం అంటే, పని చేయడం మాని విశ్రమించడమే. ఆరాధన మరియు బలి, ఇశ్రాయేలీయుల యొక్క దిన చర్యలు ప్రత్యేకించి సబ్బాతుతో ముడివేయబడియుండలేదు.

సబ్బాతు దినాన ఆరాధన కొరకై సమాజంగా కూడాలని ఇశ్రాయేలీయులు ఆజ్ఞాపింప బడలేదు. "సబ్బాతు దిన ప్రయాణము" (ఒక మైలులో ఐదింట మూడవ భాగం) సాంప్రదాయ పరంగా పరిమితి చేయబడినందున, సబ్బాతు దినాన యెరూషలేములోను లేదా దానికి సమీప ప్రాంతాలలోను నివసించే వారే ఆరాధనకు కూడగలిగే అవకాశ ముంటుంది.

దేవుడు ఇశ్రాయేలీయులకు పది ఆజ్ఞలు యిచ్చిన అనేక సంవత్సరాలవరకు సబ్బాతు బహిరంగంగా కూడే దినంగా రూపొందలేదు. దేవాలయము నాశనం చేయబడి, యూదులు బబులోనుకు చెరగొనిపోబడినప్పుడు, లేఖనాల బహిరంగ ప్రకటన కొరకు సమాజ మందిరాలు నిర్మింపబడ్డాయి. "చెర కాలంలో సమాజ మందిరాలు పెంపొందడంతో, సబ్బాతు ఆరాధనా దినంగాను, ధర్మశాస్త్రం పఠించే దినంగాను, విశ్రాంతి దినంగాను రూపొందింది."[1]

దానికి ముందు, ఇశ్రాయేలీయులు యెరూషలేములోనే ఆరాధించేవారు. వారు ఆరాధించడానికి దేవుడు కోరుకున్న స్థలం అదే.[2] వారు యిలా చెప్పబడ్డారు,

> నీవు చూచిన ప్రతి స్థలమున నీ దహనబలులను అర్పింపకూడదు సుమీ. యెహోవా నీ గోత్రములలో ఒకదానియందు ఏర్పరచుకొను స్థలముననే నీ దహన బలులను అర్పించి నేను మీ కాజ్ఞాపించుచున్న సమస్తమును అక్కడనే జరిగింప వలెను (ద్వితీయో. 12:13, 14).

లేవీయ. 23:2 "పరిశుద్ధ సంఘమని" ప్రస్తావిస్తుంది. ఎక్కడ ఎందుకు కూడాలో చెప్పబడలేదు. సబ్బాతు దినపు ఆచారం దేశమంతా ఒక్క చోట లేక పెద్ద పట్టణంలో ఉన్న ప్రతి ఒక్కరు ఒక చోట చేరే అవకాశాన్ని రద్దు చేస్తుంది. సబ్బాతును ఆచరించడాన్ని గూర్చి ఇశ్రాయేలీయులకు యిలా ఆజ్ఞాపించబడింది: "... ప్రతివాడును తన తన చోట నిలిచి యుండవలెను. ఏడవ దినమున ఎవడును తన చోటనుండి బయలు వెళ్లకూడదు" (నిర్గమ.

16:29బి). ఈ ఆజ్ఞ యింటివారి కూడికకు పరిమితి చేస్తుంది. లేవీయకాండం 23:3లో "పరిశుద్ధ సంఘము" అనే ప్రయోగం "సంపూర్ణ విశ్రాంతికి" జత చేయబడినదై, యింటివారు విశ్రాంతికై కూడుకొనే సమయం అని అర్థమైయుండాలి.

## ప్రభువైన యేసు మరియు సబ్బాతు

ప్రభువైన యేసు ధర్మశాస్త్రం క్రింద జన్మించాడు (గలతీ. 4:4). ఇందునుబట్టి, ఆయన సబ్బాతుతో సహా ధర్మశాస్త్ర సంబంధమైన ఆజ్ఞలన్నిటిని అనుసరించాడు.

ప్రభువు సబ్బాతు దినాన స్వస్థపరచినప్పుడు, వారి పారంపర్యాన్ని బట్టి ఆయన సబ్బాతు దినాన్ని ఆచరించలేదని యూదులు కలత చెందారు. సబ్బాతుకు ప్రభువుగా, ఏడవ దినపు విశ్రాంతిని గూర్చి ఆయన బాగుగా ఎరిగినవాడైయున్నాడు. సబ్బాతు దినాన గోదుమ వెన్నులు తుంచి తినడానికి ఆయన అనుమతించడంతో (మత్తయి 12:1-8; మార్కు 2:23-28; లూకా 6:1-5), "సబ్బాతుపై ఆయన తన అధికారాన్ని స్థాపించుకున్నాడు. సబ్బాతును సరిగా ఆచరించడం అనే దానిమీద పరిసయ్యులు కాక, ఆయనయే ఉత్తరవు నియ్యగలవాడైయున్నాడు."[3]

సబ్బాతు దినాన ప్రభువు ఊచ చెయ్యి గలవానిని (మత్తయి 12:10-13; మార్కు 3:1-5; లూకా 6:6-10); నడుము వంగిపోయిన స్త్రీని (లూకా 13:11-16); జలోదర రోగముగల వానిని (లూకా 14:1-5); బేతెస్ద అనబడిన కోనేటివద్ద పడియున్న ఒకని తన పరుపు నెత్తుకొని నడిచేలా (యోహాను 5:1-18; 7:19-23); పుట్టు గ్రుడ్డువానిని (యోహాను 9:1-7) స్వస్థపరచాడు. సబ్బాతు దినాన మేలు చేయడం ధర్మమేనని ఆయన తన విమర్శకులకు ప్రత్యుత్తరమిచ్చాడు (మత్తయి 12:12). "మరియు – విశ్రాంతిదినము మనుష్యులకొరకే నియమింపబడెను గాని మనుష్యులు విశ్రాంతిదినము కొరకు నియమింపబడలేదు" అని ఆయన ప్రకటించాడు (మార్కు 2:27).

సబ్బాతు దినాన స్వస్థపరచడం మాత్రమేగాక, ప్రభువైన యేసు యూదుల సమాజ మందిరాల్లో కూడా బోధించాడు (మార్కు 1:21: 6:2; లూకా 4:16, 31; 6:6; 13:10). ఏదియేలాగున్నా, పరిసయ్యులయొక్క పారంపర్యాలను ఆయన అతిక్రమించడంవలన ప్రభువుకును, యూదులకును మధ్య సంఘర్షణ ఏర్పడింది. "సబ్బాతు దినాన ఏమి చేయవచ్చో ఏమి చేయకూడదో పరిసయ్యులు ఖచ్చితంగా నిర్వచింప ప్రయత్నించారు. సబ్బాతు దినాన చేయకూడని ముప్పై తొమ్మిది ప్రధాన కార్యములను మిష్. *Shabbath* పేర్కొంటుంది ..."[4]

పరిసయ్యుల జాబితాను ప్రభువైన యేసును, ఆయన శిష్యులును అతిక్రమించారు: వెన్నులు తుంచడం నిషేధించబడింది (మార్కు 2:23, 24); మరణాపాయంలో లేనివారు సహాయం చేయబడకూడదు, స్వస్థపరచకూడదు (మార్కు 3:1), వస్తువులు మోయకూడదు లేక ఎత్తుకొని పోకూడదు (యోహాను 5:9, 10).[5] ఈలాటి సంగతులను గూర్చి ఒక సందర్భంలో ఎదుర్కొన్నప్పుడు, తానును తన తండ్రియును సబ్బాతు దినాన పని చేశామని ప్రభువైన యేసు ఉత్తరమిచ్చాడు (యోహాను 5:17).

సబ్బాతును క్రైస్తవులు ఆచరించాలని ప్రభువైన యేసు సూచించాడా? "... మీరు పారిపోవుట చలికాలమందైనను విశ్రాంతిదినమందైనను సంభవింపకుండవలెనని ప్రార్థించుడి" (మత్తయి 24:20బి) అని ఆయన తన శిష్యులకు తెలియజేసినందున, సబ్బాతును ఆచరించుడని చెప్పినట్టు కొందరు అన్నారు. ఎందుకో ప్రభువు వివరించలేదు గనుక, కేవలం మనం ఊహించగలం. "విశ్రాంతిదినమున (చేయదగినంత) ప్రయాణాన్ని గూర్చిన," కేవలం మనం దూర ప్రయాణం చేయకుండ వారిని ఆపుతుందా లేదా సబ్బాతు దినాన యెరూషలేము ద్వారాలు మూయబడియుంటాయి గనుక పారిపోవడం ఆటంకపరచబడుతుందా? ఈ పరిస్థితిలో క్రైస్తవులు బహు ఘోరమైన అపాయంలో నిలిచియున్నారు. సబ్బాతు దినాన కట్టెలు ఏరుకొంటున్న వానిని రాళ్లతో చావగొట్టినట్టే (సంఖ్యా. 15:32, 36) జరుగుతోంది.

> యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు – మీ విషయములో జాగ్రత్తపడుడి, విశ్రాంతి దినమున ఏ బరువును మోయకుడి, యెరూషలేము గుమ్మములలో గుండ ఏ బరువును తీసికొని రాకుడి. విశ్రాంతిదినమున మీ యిండ్లలోనుండి యే బరువును మోసికొని పోకుడి, యే పనియు చేయకుడి, నేను మీ పితరుల కాజ్ఞాపించినట్లు విశ్రాంతి దినమును ప్రతిష్ఠిత దినముగా ఎంచుకొనుడి (యిర్మీయా 17:21, 22).

చలికాలమందైనను విశ్రాంతి దినమందైనను పారిపోయేలా క్రైస్తవులు బలవంత పెట్టబడియుండినట్లయితే, అది వారికి ఘోరంగా ఉండేదే. శీతాకాలం వర్షంవలన గాని, మంచువలన గాని బహుగా చలిని తెచ్చేదే. సబ్బాతైతే, యూదుల యొక్క పారంపర్యాచారాలను మీరినందున వారివలన క్రైస్తవులకు ఆటంకం కలిగియుండేదే.

ఆర్. సి. హెచ్. లెన్ స్కి – చలికాలమందైనా విశ్రాంతి దినమందైనా పారిపోవడాన్ని గూర్చి యిలా అన్నాడు:

> ... చలి చెమ్మతో కూడిన పాలస్తీనా శీతాకాలం మరియు "మీరు పారిపోవడం" ఆ కాలంలో జరిగే అవకాశముంది. దేశం మూఢ భక్తిగల యూదులచేత నింపబడినప్పుడు అది సబ్బాతు దినంలోనైనా జరుగవచ్చు. సబ్బాతును మీరు విడిచి పెట్టినట్టు ఊహించి కోపోద్రేకులై మండిపడవచ్చు. యూదుల కట్టడలను సబ్బాతుతో కూడ చేర్చి క్రైస్తవులు అప్పటిలో ఆచరిస్తున్నారనడానికి ఏ విధమైన రుజువు లేదు.[6]

డి. ఎ. కారసన్ యిలా వివరించాడు,

> సబ్బాతు దినాన ఏ విధమైన ప్రయాణంగాని పారిపోవడం గాని తప్పని యేసు తన శిష్యులకు బోధించలేదు. సబ్బాతు దినాన పారిపోవద్దని ఆయన వారికి అడ్డుపెట్టలేదు. అయితే వారు పారిపోతారని ముందుగా తలంచి, వారు వేరొక దినాన పారిపోయేలా ప్రార్థించుడని ఆయన వారిని హెచ్చరించాడు. పాలిచ్చు తల్లులు (24:19), శీతాకాలపు వర్షాలు, చలి (24:20ఎ) వారి వేగాన్ని తగ్గించి, ప్రాణాలు కోల్పోయే స్థితికి తెస్తాయని, అలాగే సబ్బాతు కట్టడలు గవునులను మూసి దుకాణాలను మూయించడం లాంటివి జరిగించినందునను, సబ్బాతు దినాన చేయవలసినంత ప్రయాణ దూరం మించకుండ ఆటంకాలు జరుగుతాయని ముందుగానే హెచ్చరించడమైనది.[7]

సబ్బాతును ఆచరించవలసిందిగా ప్రభువు క్రైస్తవులకు ఆదేశించాడని ఈ ప్రతిపాదనను బట్టి రుజువు చేయబడుతుందనుకున్నా, పనిగాని ప్రయాణం గాని ఆ దినాన చేయకూడదనే అది రుజువు చేస్తుంది. అంతేగాని, క్రైస్తవులు సబ్బాతు దినాన ఆరాధించాలని అది రుజువు చేయదు. ఎందుకంటే – ఆ ప్రతిపాదన సబ్బాతు దినాన – ప్రయాణాన్ని గూర్చి మాత్రమే మాట్లాడుతుంది గాని ఆరాధనను గూర్చి మాట్లాడడం లేదు. సబ్బాతును గూర్చిన శాసనం యూదుల జాతీయ చట్టంలో భాగమైయుంది. అది ఇశ్రాయేలీయులకు వెలుపలవారిని బద్ధులనుగా చేసే చట్టమైయుండదు.

సబ్బాతు నిరంతరం నిలిచేది కాదు. ఇశ్రాయేలును గూర్చి దేవుడు హోషేయ ద్వారా యిలా ప్రవచింపజేశాడు: "దాని ఉత్సవకాలములను పండుగలను అమావాస్యలను విశ్రాంతి దినములను నియామక కాలములను మాన్పింతును" (హోషేయ 2:11). రోమా సైన్యముచే ఇశ్రాయేలు దేశము కూల్చబడి, యెరూషలేము (క్రీ. శ. 70న) పతనమైనప్పుడు ఈ ప్రవచనము నెరవేర్చబడి యుండవచ్చును.

## అపొస్తలుల కార్యములలో సబ్బాతు

అపొస్తలుల కార్యాలు తొలి పదమూడు అధ్యాయాలలో "విశ్రాంతి దినమున నడవదగినంత సమీపమున" అనేదే సబ్బాతును గూర్చి చెప్పబడింది (అపొ. 1:12). యూదుల యొక్క పారంపర్యాన్ని బట్టి ఒక మైలు యొక్క అయిదంతల్లో మూడవ భాగం, లేక కొన్ని పరిస్థితుల్లో దానికంటె రెట్టింపు కంటె మించి ప్రయాణం చేయకుండ యూదులు ఆటంకపరచారు. అపొస్తలుల కార్యాల్లోనేగాని క్రొత్త నిబంధనలోని ఏ యితర రచనల్లోనే గాని సబ్బాతు దినాన క్రైస్తవులు విశ్రాంతి తీసికొన్నట్టుగాని, ఆరాధనకు కూడినట్టుగాని సూచింపబడలేదు.

యూదులు కూడుకొనిన ఆ స్థలములో ఆ దినమున – సమాజ మందిరములో విశ్రాంతి దినాన పౌలు బోధించాడు (అపొ. 13:14, 42, 44; 16:13; 17:2; 18:4). ఏదియెలాగున్నా, సబ్బాతు దినాన అతడు సంఘంతో కూడినట్టుగాని, లేదా సంఘం సబ్బాతు దినాన కూడుకున్నట్టుగాని ఏ సూచనా లేదు. సబ్బాతు దినాన మోషేయు ప్రవక్తల రచనలను యూదులు చదవడానికి కూడినట్టు సూచిత విషయాలున్నాయి (అపొ. 15:21; 13:27 చూడు).

యూదా మతాచారాలను అన్యజనులు ఆచరించాలా? అనే విషయాన్ని గూర్చి అపొస్తలులు పెద్దలు అనేవారి సందేశాన్ని కనుగొనడానికి పౌలును బర్నబాయు యెరూషలేము వెళ్లారు (అపొ. 15:1, 2). క్రైస్తవులుగా మారిన కొందరు యూదులు అంటే, "పరిసయ్యుల తెగలో విశ్వాసులైన కొందరు లేచి, అన్యజనులకు సున్నతి చేయింప వలెననియు, మోషే ధర్మశాస్త్రమును గైకొనుడని వారికి ఆజ్ఞాపింపవలెననియు చెప్పిరి" (అపొ. 15:5). కొంత చర్చ జరిగిన తరువాత, పేతురు యిలా అన్నాడు: "గనుక మన పితరులైనను మనమైనను మోయలేని కాడిని శిష్యుల మెడమీద పెట్టి మీరెందుకు దేవుని శోధించుచున్నారు?" (అపొ. 15:10). పేతురుచే ప్రస్తావించబడిన కాడి సున్నతి మరియు

ధర్మశాస్త్రమై ఉండాలి. వాటిని సున్నతి పొందియుండిన క్రైస్తవులైనవారు అన్యజనులలో నుండి క్రైస్తవులైన వారిమీద రుద్దుతున్నారు.

అన్యజనులలోనుండి వచ్చినవారు సున్నతి చేయబడాలి, మోషే ధర్మశాస్త్రాన్ని వారాచరించాలని నిగ్గదీస్తున్నవారికి జవాబుగా (అపో. 15:5) యాకోబుచే ఒక ఉత్తరం సూచింపబడింది: "వారికి మేమధికారమిచ్చియుండలేదు" అని అందు చెప్పబడింది (అపో. 15:24). "... ఈ అవశ్యమైన వాటికంటె ఎక్కువైన యే భారమును మీ మీద మోపకూడదని, పరిశుద్ధాత్మకును మాకును తోచెను" అని యింకను సూచించింది (అపో. 15:28). అవశ్యమైనవాటిలో ధర్మశాస్త్రం యొక్క కొన్ని నిర్బంధాలు మాత్రమే చేర్చబడ్డాయి. అందులో సున్నతిగాని, ధర్మశాస్త్రమంతటిని ఆచరించడం గాని, సబ్బాతు దినాచారంగాని లేదు. దీనిని బట్టి, అన్యజనులలోనుండి వచ్చిన క్రైస్తవుల మీద ధర్మశాస్త్ర మంతటినిగాని కనీసం సబ్బాతునుగాను అపొస్తలులచే, యెరూషలేములోని పెద్దలచే, లేక పరిశుద్ధాత్మచే మోపబడలేదు. యూదా మత సంబంధమైన ఆచారాలు అన్యజనులలోనుండి వచ్చిన క్రైస్తవులపై మోపడానికి పౌలును బర్నబాయు నిరాకరించడంలో వారు న్యాయవంతులని రుజువు చేయబడ్డారు.

## పౌలు రచనలలో సబ్బాతు

ధర్మశాస్త్రము రద్దు చేయబడినట్టు పౌలు తన రచనలలో స్థిరపరచాడు.[8] క్రైస్తవులు యూదుల యొక్క ప్రత్యేక దినాలను గాని సబ్బాతునుగాని ఆచరింపనవసరం లేనివారైయున్నట్టు అతడు సూచించాడు.

గలతీయలో ఉన్న క్రైస్తవులకు వ్రాస్తూ అతడిలా అన్నాడు: "... ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున ఏ శరీరియు నీతిమంతుడని తీర్చబడడు గదా" (గలతీ. 2:16); "నేనైతే ... ధర్మశాస్త్రము విషయమై చచ్చినవాడనైతిని" (2:19); "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు" (3:10); "ధర్మశాస్త్రముచేత ఎవడును దేవునియెదుట నీతిమంతుడని తీర్చబడడను సంగతి స్పష్టమే" (3:11); "... ఆ సంతానము వచ్చువరకు అది అతి క్రమమును బట్టి ... ఇయ్యబడెను" (3:19) "ఇక బాలశిక్షకుని (ధర్మశాస్త్రం) క్రింద ఉండము" (3:25); "మరల దాస్యమను కాడి (ధర్మశాస్త్రము) క్రింద చిక్కుకొనకుడి" (5:1; 4:21-31 సందర్భములో); "మీలో ధర్మశాస్త్రమువలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరు చేయబడియున్నారు, కృపనుండి తొలిగిపోయి యున్నారు" (5:4); మరియు "... మీరు ధర్మశాస్త్రమునకు లోనైనవారుకారు" (5:18).

ఈ ప్రతిపాదనల సందర్భంలో, పౌలు యిలా వ్రాశాడు: "మీరు దినములను, మాసములను, ఉత్సవకాలములను, సంవత్సరములను ఆచరించుచున్నారు. మీ విషయమై నేను పడిన కష్టము వ్యర్థమై పోవునేమో అని మిమ్మును గూర్చి భయపడుచున్నాను" (గలతీ. 4:10, 11). గలతీ పత్రికలో పౌలు యూదా మత సంబంధమైన ఆచారాలపై దృష్టి నిలిపినందున, అన్యజనుల ప్రత్యేక దినములను గూర్చి కాక, ప్రత్యేకించి యూదులు పాటించే దినాలను గూర్చి మాత్రమే అతడు సూచించియుండాలి.

“దినములు, మాసములు, ఉత్సవకాలములు, సంవత్సరములు” అనడంలో, యూదా మత సంబంధమైన పండుగలను అతడు సూచించియుండాలి. ఎందుకంటె, యూదా మతపరమైన వాదులే పౌలును గలతీయలో బలంగా ఎదిరించారు. అది అలాగైనట్టయితే, “దినములు” అనేవి సబ్బాతు మరియు యితర ఒక దినపు పండుగ ఆచారాలను సూచిస్తున్నాయి; మాసములనేవి అమావాస్యలవంటి ఉత్సవాలను చేయడంగా ఉండవచ్చు (సంఖ్యా. 10:10).[9]

> గలతీయలో ఉన్న పోరాటం యొక్క దృష్టిలో, గలతీయులయొక్క ఆచరణలు యూదా మతంయొక్క ఆచరణలకు లోనైయ్యాయనడంలో సందేహమే అక్కరలేదు. “దినములు” అనేవి క్యాలండర్‌లో ప్రత్యేకమైన దినములలో వచ్చిన పండుగ దినములతో చేర్చి, విశ్రాంతి దినాలను సూచిస్తున్నాయి.[10]

తాము ధర్మశాస్త్రమునుండి విడుదల చేయబడినవారని, యూదుల యొక్క పరిశుద్ధ దినాలను ఆచరించవలసిన అవసరం తమకు లేదని పౌలు గలతీయలోనున్న క్రైస్తవులకు జ్ఞాపకం చేస్తున్నాడు.

కొలస్సీలోని సంఘానికి అతడు అలాటి ఉపదేశాన్నే యిచ్చాడు:

> కాబట్టి అన్నపానముల విషయములోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతిదినము అనువాటి విషయములోనైనను, మీకు తీర్పు తీర్చ నెవనికిని అవకాశమియ్యకుడి. ఇవి రాబోవువాటి ఛాయయేగాని నిజ స్వరూపము క్రీస్తులో ఉన్నది (కొలస్సీ. 2:16, 17).

అన్నపానముల విషయములోనైనను, పండుగలు, ప్రత్యేక దినాచారములు, లేక సబ్బాతు దినాలు అనేవాటి విషయములోనైనను క్రైస్తవుడు తీర్పు తీర్చడానికి ఎవనికిని అవకాశ మియ్యకూడదు. ఆయన సిలువపై మరణించినప్పుడు, వీటి విషయమై మనకుండే బాధ్యతను క్రీస్తు అంతమొందించాడు. అవి కేవలం పరలోక సంబంధమైన వాటికి ఛాయా రూపాలే (హెబ్రీ. 8:5; 10:1 చూడు). క్రీస్తుచే తేబడే నిజ స్వరూపాలకు అవి కేవలం ఛాయా రూపకమైన ఆచరణలే (కొలస్సీ. 2:17; హెబ్రీ. 9:9, 10 చూడు).

“విధి రూపకమైన ఆజ్ఞలు” (Gk.: *dogmasin*) కొట్టివేయబడ్డాయి (ఎఫెసీ. 2:15), “వ్రాతరూపకమైన ఆజ్ఞలు” (Gk.: *dogmasin*) సిలువకు మేకులతో కొట్టబడ్డాయి (కొలస్సీ. 2:14). అవి తప్పనిసరియని చెప్ప ప్రయత్నించేవారు, వాటిని చేయడం ద్వారా నీతిమంతులుగా తీర్చబడ గోరుతున్నారు. అట్టివారు పౌలు ప్రయాసలను వ్యర్థపరచు తున్నారు.

## ముగింపు

విశ్రాంతి దినమున పని చేయకూడదని తమ చరిత్రయందంతటిలో దేవుడు మాటి మాటికి యూదులకు జ్ఞప్తి చేయవలసి వచ్చింది. ఏదియెలాగున్నా, సబ్బాతు దినమందు

పని విషయంలోగాని హెచ్చరికగా క్రైస్తవులకు ఒక్క మాటైనను యివ్వలేదు. సబ్బాతు ఆచరణకు పరిచయం లేని సాంప్రదాయంనుండి అన్యజనులు వచ్చినందున, అవసరమై యుంటే, సబ్బాతు దినాన పని చేయకూడదని, ఆరాధించాలని వారు బోధింపబడవలసి ఉంటుంది. క్రొత్త నిబంధనలో ఆలాటి బోధ చేయబడలేదనే వాస్తవం, యూదులు సబ్బాతు దినం అన్యజనుల మీద మోపబడ కూడదనడానికి రుజువుగా ఉంది. అది విశ్రాంతి దినముగా గాని, ఆరాధన దినముగా గాని క్రైస్తవులకు వర్తించదు.

సబ్బాతు యూదులకు ప్రత్యేకమైన దినం. ఆ దినాన వారు ఏ పనియు చేయకూడదు. వారు ఆ దినమున విశ్రమించి, దేవుడు వారిని ఐగుప్తు దాస్యంనుండి ఎలా విడిపించాడో ఆ సంగతిని వారు జ్ఞాపకం చేసికొనవలసినవారై ఉన్నారు. అది దేవునికిని ఇశ్రాయేలు జనాంగానికిని మధ్య గురుతును, నిబంధనయునైయుంది. అది అన్యజనులకు ఎన్నడు ఉద్దేశింపబడలేదు లేక యివ్వబడలేదు. లేదా క్రైస్తవులకు అది ఎప్పుడు ఆజ్ఞాపింపబడలేదు. ఇప్పుడు క్రీస్తు ప్రభువు వచ్చాడు, తన మరణము పునరుత్థానాల ద్వారా ఆయన వారిని తమ మరణంనుండి ఎలా విడిపించాడో జ్ఞాపకం చేసికొనడానికి గాను క్రైస్తవులు ఆదివారమున కూడుకొంటారు.

---

సూచనలు

[1]J. D. Douglas, ed., *The New International Dictionary of the Bible,* gen. ed. Merrill C. Tenney (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1987), s.v. "Sabbath," by Steven Barabas. [2]యాకోబు బావి యొద్ద సమరయ స్త్రీతో ప్రభువు చేసిన సంభాషణయందు యోహాను 4:19–22లో గుప్తం చేసినట్లు, యెరూషలేము యూదులకు ఆరాధనా స్థలంగా ఉండడం దేవుని చిత్తమైనట్లు చూపుతుంది. [3]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary Series, ed. Everett Ferguson (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 171. [4]J. C. McCann Jr., "Sabbath," in *The International Standard Bible Encyclopedia,* gen. ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 4:251. [5]E. Lohse, VII, *"sabbaton,"* in *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel and Gerhard Friedrich, trans. and abr. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 991. [6]R. C. H. Lenski, *The Interpretation of St. Matthew's Gospel* (Minneapolis, Minn.: Augsburg Publishing House, 1943), 939-40. [7]D. A. Carson, ed., *From Sabbath to Lord's Day: A Biblical, Historical, and Theological Investigation* (Grand Rapids, Mich.: Academic Books, Zondervan Publishing House, 1982), 73-74. [8]ధర్మశాస్త్రము రద్దు చేయబడిన సంగతిని తరువాత పాఠంలో చూడు. [9]Daniel C. Arichea Jr. and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letter to the Galatians* (New York: United Bible Societies, 1976), 97. [10]James Montgomery Boice and Merrill C. Tenney, eds., *The Expositor's Bible Commentary,* vol. 10, *Romans-Galatians,* gen. ed. Frank E. Gaebelein (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1976), 476.